క్లుప్తంగా

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలో ఆరు రోజుల పాటు నిర్వహించే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని ప్రముఖ వేదపండితులు వెంకటశేష శర్మ తెలిపారు. మంగళవారం నుంచి జనవరి 5 వరకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఆత్మకూర్‌లో ఉత్సవమూర్తి విగ్రహాల ఊరేగింపు చేస్తామన్నారు.

తరుగు పేరిట రైతులకు అన్యాయం

ఆత్మకూర్: తరుగు పేరిట మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని వీరరాఘవపురం గ్రామానికి చెందిన రైతులు కృష్ణారెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఈనెల 24న సన్నరకం ధాన్యం 869 బస్తాలను తేమ శాతం పరీక్షించిన అనంతరం కొనుగోలు చేశారన్నారు. వనపర్తిలోని ఓ రైస్‌మిల్లుకు ధాన్యం తరలిస్తే నాలుగు బస్తాలు తరుగు వచ్చిందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

మామిడి రైతులకు అవగాహన

వీపనగండ్ల: మండల కేంద్రంలోని రైతువేదికలో ఉద్యానవన శాఖ అధికారులు మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో మామిడి రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మామిడి తోటలో పూర్తి స్థాయిలో పూత వచ్చి పిందె, కాయ దశలో సోకే తెగుళ్లు, చీడపీడల నివారణకు తగు సూచనలు చేసినట్లు మండల ఉద్యానవనశాఖ అధికారి కృష్ణ తెలిపారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి



మదనాపురం: తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర నూతన కార్యవర్గం రాష్ట్ర కార్యదర్శిగా మదనాపురం మండల కేంద్రానికి పద్మశాలి నాయకుడు కోడం సుధాకర్ హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకున్నారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు, చేనేత కార్మికుల సంక్షేమ కోసం కృషి చేస్తానన్నారు. చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం శ్రమిస్తామని తెలిపారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జిల్లా కమిటీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మైక్‌సెట్ బహూకరణ



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు జిల్లా పరిషత్ పాఠశాలకు సోమవారం గ్రామస్తుడు గెజిటెడ్ హెడ్ మాస్టర్ దుప్పలి లక్ష్మీనారాయణ గుప్త మైక్ సౌండ్ సెట్ బహూకరించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి షేక్ ఫరూక్ హుస్సేన్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా విద్యార్థుల కోసం మైక్ సెట్‌ను బహూకరించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల తరఫున పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామ్‌ప్రసాద్, ధృవ్‌కుమార్, లక్ష్మయ్య, రజిత, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



పాన్‌గల్: మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని అన్నారంతండాలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల జాబితాను వద్ద ఉంచుకొని, దాని ఆధారంగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. మండలంలో ఇప్పటికి 63 శాతం పూర్తైనట్లు ఆయన పేర్కొన్నారు.

■ నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటకు చెందిన వ్యక్తి ఈ ఏడాది ఫిబ్రవరి 4న ఆన్‌లైన్‌లో ఉన్న అడ్వర్టైజ్మెంట్ చూసి అందులోని నంబర్‌కు ఫోన్ చేశాడు. అతి తక్కువ ధరకే కారు వస్తుందనే ప్రకటన చూసి సంప్రదించగా, వాళ్లు నమ్మించి అడ్వాన్స్ కింద రూ.30,350 ఫోన్ పే చేయించుకున్నారు. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీస్‌లను సంప్రదించాడు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఓ వ్యాపారికి అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. పర్వతాలు గారు.. నేను మీ మున్సిపాలిటీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాను. మీ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయాలంటూ తన ఫోన్ నెంబర్‌కి రూ.9,800 ఫోన్ పే చేయించుకున్నాడు. డబ్బులు పంపాక రసీదు ఇవ్వకపోవడం, ఫోన్ ఎత్తకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

■ ఫిబ్రవరి 2న నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన ఓ వ్యాపారికి అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను బ్యాంకు అధికారిగా చెబుతూ.. ఏటీఎం కార్డు రెన్యువల్ కోసం ఓటీపీ కావాలని అడిగాడు. బాధితుడు ఓటీపీ నంబర్ చెప్పగా ఆయన ఖాతాలోని రూ.6,99,000 మాయమయ్యాయి. షాక్ తిన్న బాధితుడు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ మాయ!

ఉమ్మడి పాలమూరును బెంబేలెత్తిస్తున్న సైబర్ మోసాలు

- గత సంవత్సరంతో పోలిస్తే 15.42 శాతం పెరిగిన నేరాలు
- ఈ ఏడాది అమాయకుల నుంచి రూ.10 కోట్ల మేర దోపిడీ



కొల్లగొట్టింది రూ.10 కోట్లు.. రికవరీ రూ.28.15 లక్షలే..

రివైండ్ 2024

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్ : ఈ ఏడాది 15.42 శాతం పెరిగిన కేసులు.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గతేడాదిలో 1,766 సైబర్ కేసులు నమోదు కాగా.. ఈ సంవత్సరం 2,724 నమోదయ్యాయి. ఈ లెక్కన 15.42 శాతం మేర సైబర్ నేరాల శాతం పెరిగినట్లు తెలుస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఒక్క నారాయణపేట జిల్లాలోనే సైబర్ నేరాల సంఖ్య తగ్గగా.. మిగతా అన్ని జిల్లాల్లోనూ పెరిగాయి. నమోదైన కేసులు కొన్ని మాత్రమే కాగా.. తమ పేర్లు బయటకు వస్తాయని, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదు చేయని వారే అధిక సంఖ్యలో ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సైబర్ కేటుగాళ్లు ఈ సంవత్సరంలో అమాయకుల నుంచి రూ.10.05 కోట్లు కొల్లగొట్టారు. ఇందులో 28.15 లక్షలు మాత్రమే రికవరీ కాగా..పోలీసులు న్యాయప్రక్రియ పూర్తి చేసి ఆయా బాధిత వ్యక్తులకు అందజేశారు. బ్యాంకుల్లో ఫ్రీజ్ అయినవి సుమారు రూ.2 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. అంటే సైబర్ కేటుగాళ్లు మిగతా సొమ్మును మింగేసినట్లు అర్థమవుతోంది.

జిల్లాల వారీగా ఇలా..

- మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాదిలో సైబర్ నేరగాళ్లు సుమారు రూ.4 కోట్ల వరకు కొల్లగొట్టినట్లు అంచనా. ఇందులో కేవలం రూ.55,000 రికవరీ అయ్యాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో సైబర్ మోసగాళ్లు అమాయకుల నుంచి రూ.57,96,325 దోచుకోగా.. పోలీసులు వారి నుంచి రూ.10,08,278 రికవరీ చేశారు.
- గద్వాల జిల్లాలో సైబర్ కేటుగాళ్ల బారిన పడిన అమాయకులు రూ.3,83,50,299 కోల్పోగా.. పోలీసులు 10,59,051 రికవరీ చేశారు. ఇవి పోనూ పలువురు బాధితులకు సంబంధించిన రూ.55,29,181 పలు బ్యాంక్‌లలో ఫ్రీజింగ్‌లో ఉన్నాయి.
- నారాయణపేట జిల్లాలో రూ.13,13,000కు గాను ఇప్పటివరకు పోలీసులు రూ.1,63,000 మాత్రమే రికవరీ చేయగలిగారు.
- వనపర్తి జిల్లాలో రూ.1.50 కోట్లకు గాను ఇప్పటి వరకు కేవలం రూ.5.30 లక్షలు రికవరీ అయినట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి.

1930 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలి..

సైబర్ నేరాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. సైబర్ మోసానికి గురైనట్లు తెలిసిన వెంటనే 1930 లేదా డయల్ 100కు ఫోన్‌చేస్తే నిందితుల ఖాతాలను స్తంభింపజేయవచ్చు. తద్వారా కోల్పోయిన సొమ్ము రికవరీ చేసేందుకు అవకాశం ఉంటుంది. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో కొత్త పంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్లు, మెసేజ్‌లకు స్పందించొద్దు.

– రామేశ్వర్, ఏఎస్పీ, నాగర్‌కర్నూల్

అవగాహన కల్పిస్తున్నా..

సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ప్రతి సంవత్సరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది సైతం క్షేత్రస్థాయిలో వ్యాపారులతో పాటు మున్సిపాలిటీల పరిధిలోని కాలనీల్లో, మండలాల పరిధిలో గ్రామాల్లో విస్తృతంగా అవగాహన క్యాక్రమాలు చేపట్టింది. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 483, నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,080, నారాయణపేటలో 328, గద్వాల, వనపర్తిలో 400 వరకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అయినా సైబర్ మోసాలకు అడ్డుకట్ట పడకపోవడం ఆందోళన రేపుతోంది.

ఇలా మోసపోతున్నారు..

జిల్లాలో నమోదైన సైబర్‌క్రైం కేసుల్లో అధికంగా వేక్ యాప్‌లలో అధిక లాభాలకు ఆశపడి పెట్టుబడి పెట్టి నష్టపోయిన వారే ఉన్నారు. ఏపీకే యాప్ లింక్‌లపై టచ్ చేసి ఖాతాల్లోని నగదును పొగొట్టుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. బ్యాంకుల్లో రుణం ఇప్పిస్తాం.. కొంత డబ్బులు డిపాజిట్ చేయాలని, క్రెడిట్ కార్డు బిల్స్ క్లియర్ చేస్తామని చెప్పి ఆన్‌లైన్‌లో లింక్‌లు పంపించి.. ఫోన్ కాల్స్, బ్యాంక్ ఏటీఎంల పేరుతో నగదు అపహరించినట్లు కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్న వారిలో విద్యాధికులే ఉండడం గమనార్హం. అత్యాశే ఇందుకు కారణమని పోలీసులు చెబుతున్నారు.

'వేక్ యాప్'తో టోకరా..



ఈ ఏడాది మార్చిలో మా స్నేహితులు వేక్ యాప్ అనే ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు పెడితే మూడింతలు ఎక్కువగా వస్తుందని చెప్పడంతో నేను మొదట రూ.800 పెట్టాను. మొదటిసారి డబ్బులు తిరిగి నా అకౌంట్‌లో జమ చేశారు. తర్వాత ఎక్కువ మొత్తంలో వస్తాయని నేను, మా నాన్న పేరు మీద రూ.లక్ష పెట్టాను. రెండు రోజుల తర్వాత యాప్ పనిచేయలేదు. అందులో ఉన్న ఫోన్ నంబర్లకు ఫోన్ చేస్తే ఎవరూ సమాధానం ఇవ్వలేదు. తర్వాత ఎవరిని అడగాలో తెలియలేదు. నాలాగా మోసపోయిన వారు గోపాల్‌పేట మండలంలో చాలా మంది ఉన్నారు. వీలైతే మా డబ్బులు ఇప్పిస్తే బాగుంటుంది.

ప్రసాద్, పాలికెపాడు గ్రామం, గోపాల్‌పేట మండలం

ముద్ర, విశ్వకర్మ రుణం పేరిట..

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన కొత్త కుమ్మరి రాజు 2024 జనవరిలో 'ముద్ర విశ్వకర్మ రుణం' కోసం దరఖాస్తు చేసుకున్నాడు. జూలైలో సైబర్ నేరగాళ్లు కుమ్మరి రాజు వాట్సాప్ నంబర్‌కు పీఎం విశ్వకర్మ రుణం పొందేందుకు మీరు అర్హులని మెస్సేజ్ పంపించారు. రుణం మంజూరు కావాలంటే కొంత డబ్బులు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు అడుగగా.. గూగుల్ పే, ఫోన్ పే ద్వారా రూ.12,250 చెల్లించాడు. అనంతరం మళ్లీ ట్యాక్స్ చెల్లించాలంటూ మరోమారు రూ.9వేలు చెల్లించాలని అడగడంతో అనుమానం వచ్చిన బాధితుడు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇది వరకు రిమాండ్ చేసిన నేరస్తుల నుంచి తీసుకున్న సమాచారం మేరకు పోలీసులు అక్టోబర్ 2న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నేరస్తులు పెద్దమందడి మండలం పిల్లిగుండుతండాకు చెందిన కేతావత్ దినేష్, అతడి తమ్ముడు కేతావత్ నరేష్, పాత్లదావత్ విజయ్‌గా గుర్తించి, వారి నుంచి దాదాపు రూ.25లక్షల విలువ గల భూమి సంబంధించి రెండు డాక్యుమెంట్లు, తొమ్మిది మొబైళ్లు, 5సిమ్ కార్డులు, రెండు కార్లు, ఒక బుల్లెట్ మోటార్ సైకిల్, స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించారు.



నిందితులను చూపిస్తున్న క్రైమ్ డీఎస్పీ, కొత్తకోట సీఐ, ఎస్‌ఐ (ఫైల్)

వలంటీర్లుగా అవకాశం

ఆత్మకూర్: విద్యార్థుల్లో సామర్థ్యాలు, ప్రతిభను పెంపొందించేందుకు వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరర్ అకాడమీ ఆధ్వర్యంలో పనిచేసేందుకు వలంటీర్లుగా చేరాలని నిర్వాహకులు కోరారు. ఉమ్మడి జిల్లాలో ఇంటర్ ఆపై చదువులు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ అనంతరం వేతనాలు ఇస్తామని తెలిపారు. వివరాలకు 63009 49477 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ధ్యానంతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది



ఖిల్లాఘనపురం: ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ కోఆర్డినేటర్ పల్లాటి దీర్ఘాయువు, మునేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో పాటుగా వారు కొంత సేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాసే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొంతసేపు ధ్యానం చేయడం వలన ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.

ప్రతిభా పరీక్షలు



ఆత్మకూర్: విద్యార్థుల్లో సామర్థ్యాలు, ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిభా పరీక్షలు ఉపయోగపడుతాయని మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు అన్నారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణితం సబ్జెక్టుపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని 10 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో ఆత్మకూర్ విద్యార్థులు మొదటి స్థానంలో, తిప్పడంపల్లి విద్యార్థులు రెండో స్థానంలో, కేజీబీవీ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచి ప్రతిభను కనబర్చడంతో నగదుతో పాటు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో కేజీబీవీ విద్యార్థిని మల్లీశ్వరి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడంతో సత్కరించారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఖిల్లాఘనపురం వీరభద్ర స్వామి ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న ఆలయంలో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య రోజున ఆలయం దగ్గర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం తో పాటుగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గోపి చెప్పారు.

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలోని గుంటి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య పురస్కరించుకొని అర్చకులు స్వామివారికి అభిషేకం, అర్చన, నైవేద్యం, మహామంగళహారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రమేష్‌శర్మ, మాజీ సర్పంచ్ శారద, తిరుపతయ్య, అయ్యప్ప మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో గల అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఎన్‌హెచ్44 పక్కన నూతనంగా నిర్మిస్తున్న శ్రీ భూతనాథ అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి హైదరాబాద్‌లోని నిజాంపేట విశ్వశాస్త్ర ధార్మిక సేవాసమితి తరఫున వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేంద్రశర్మ, ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు మణివంశీ, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రూ.50,116 విరాళాన్ని అందజేశారు. అయ్యప్ప సేవాసమితి కొత్తకోట, మదనాపురం మండలాల శాఖ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు రవికాంత్‌శర్మ, విశ్వనాథం గంగాధర్, వేముల సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి ఉన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

వైద్యాధికారుల సూచనలు పాటించాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్

వీపనగండ్ల: మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు వైద్యాధికారుల సలహాలు పాటించినప్పుడే ఆరోగ్యంగా జీవించగలుగుతారని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టర్ ఆదేశానుసారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో డయాబెటీస్, హైబీపీ ఉన్న రోగులను పరీక్షించి అవసరమైన మాత్రలు అందజేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు వివిధ రకాల రోగులను గుర్తించి ఆన్‌లైన్‌లో వారి పేర్లు నమోదు చేస్తున్నారని, ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అందుతున్న మాత్రలను క్రమం తప్పకుండా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు ప్రియాంక, అఖిల్, హరిక, పలువురు హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

కవాతు కమిటీ ఎన్నిక

వనపర్తి టౌన్: హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ వద్ద 'లక్ష డప్పులు, వెయ్యి గొంతులు' కళానాయకుల కవాతు కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకుడు డప్పు స్వామి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. వనపర్తి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మొలగర కుర్మయ్య, ఉపాధ్యక్షులుగా పానుగంటి నాగన్న, మల్లిపోగు నర్సిములు, నారాయణ, వడ్డేమాన్ నర్సింహ, తొప్పెట రాములు, ప్రధానకార్యదర్శి పాము నాగులు, ప్రచార కార్యదర్శులుగా మల్లగాళ్ల మన్నెం, రవివర్మ, శివ, వెంకటేష్, దేవ, సహాయ కార్యదర్శులుగా పరమేశ్వర్, అశోక్, మిద్దె ఆంజనేయులు, జోగు చంద్రకాంత్, మిద్దె నగేష్, కోశాధికారి స్వామి, వెంకటేష్, గౌరవాధ్యక్షులు మీసాల రాము, సురేష్, బండారు కురుమయ్య, చెన్నయ్య, శివలింగం, రాజరామ్ ప్రకాష్‌ను నియమించారు.

హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య

వనపర్తి రూరల్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై మతోన్మాద మూకల దాడులను ఖండిస్తూ శనివారం వనపర్తి జిల్లా సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ మతోన్మాదులు భక్తి ముసుగులో హెచ్‌ఎంపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అమానుష చర్యను ప్రజలు, ఆధ్యాత్మిక వాదులు, పార్టీలు, ప్రజా సంఘాలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, కార్మికులు లౌకిక శక్తులు దీనికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో నందిమల్ల రాములు, చంద్రయ్య, సూరి, శివ, గోవిందు, వారన్న, నాగన్న, ఆంజనేయులు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై వామపక్షాల ఆందోళన

అమరచింత: పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈమేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా వైఖరిపై విమర్శలు చేశారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన అంబేడ్కర్ లాంటి వారిపై విమర్శలు చేసిన అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని, లోక్‌సభ సభ్యుడిగా రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, మాస్‌లైన్, సీపీఐ పార్టీల నాయకులు జీఎస్ గోపి, అజయ్, వెంకటేష్, రాజన్న, సామేలు, అబ్రహం, భాస్కర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

2 బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

అమరచింత: మండలంలోని మస్తీపురం శివారులో సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చంద్రగట్టు గ్రామానికి చెందిన నల్లారెడ్డికి తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నందిమళ్ల గ్రామానికి చెందిన నాగరాజు కాలు విరగడంతో ప్రథమ చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ధాన్యం డబ్బులు చెల్లించలేదని కౌలు రైతుల నిరసన



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

ఆత్మకూర్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మి నెల రోజులు అవుతున్నా వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని కౌలు రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట మండలంలోని ఆరేపల్లి, మోట్లంపల్లి, గుంటిపల్లి, జూరాల, తిప్పుడంపల్లి, మేడేపల్లి, దేవరపల్లి, రేచింతల, వీరరాఘవపూర్ గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము అమ్మిన ధాన్యం వివరాలను వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఓటీపీ పంపి ఆన్‌లైన్ పొందుపర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. అధికారులు తాము ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఉన్నామంటూ సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఏఓ వినయ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా సర్వేలో ఉండడం కారణంగా ఆలస్యం అవుతుందని, రెండు రోజుల్లోగా ఆన్‌లైన్‌లో ఓటీపీలు పొందుపరుస్తామన్నారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు ఏటికాడి లక్ష్మణ్, బాలస్వామి, పద్మ, శ్రీను, రవి, బాల్‌రాం, రాజు, బేబమ్మ, రాములు, వెంకటన్న ఉన్నారు.

కర్నెతండా లిఫ్టు సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరు



జీఓ కాపీని అందుకుంటున్న శంకర్‌నాయక్ తదితరులు

ఖిల్లాఘనపురం: కర్నెతండా లిఫ్టు ఇరిగేషన్ పథకానికి అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయానికి వెళ్లిన ఆయన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ.చిన్నారెడ్డిని కలిసి ఆయన ద్వార నిధుల విడుదలకు సంబంధించిన జీఓ కాపీని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లెల చిన్నారెడ్డి కృషితో లిఫ్టుకు అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.1.64 కోట్ల నిధులు మంజూరు చేస్తూ సోమవారం జీఓ 345ను విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలోనే లిఫ్టు పరిసరాల్లో అవసరమైన విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసి వానాకాలం నాటికి తండాలకు సాగునీటిని అందిస్తామని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. లిఫ్టు పనులు పూర్తయితే కర్నెతండాతో పాటుగా మామిడిమాడ, లట్టుపల్లి, షాపురం గ్రామాలతో పాటుగా 10 గిరిజన తండాల్లోని మొత్తం 5వేల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. ఆయనవెంట మాజీ సర్పంచులు పీనానాయక్, మన్యంగౌడు, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామంలో సోమవారం త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈమేరకు కమిటీ సభ్యులు మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. సృష్టిని నిర్మించిన ఆ పరమాత్ముడి ప్రబోధనలు ప్రతి ఒక్కరూ విని భక్తిభావంతో ఉండాలని కోరారు. ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని, సోమవారం అనేది ఆత్మజ్ఞానానికి గుర్తన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావన కలిగి ఉండాలని, సూచించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర చారి, నరేందర్, పురుషోత్తం, రామచంద్రయ్య, బాలకృష్ణ, పద్మ, శాంతి, అనిత, జ్యోతి, శైలజ పాల్గొన్నారు.

'శ్రమజీవుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం'

వనపర్తి రూరల్/అమరచింత: సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్గొండలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు సోమవారం వనపర్తి జిల్లా కేంద్రం, అమరచింత నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వారి వాహనాలకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు మాట్లాడుతూ దేశంలో శ్రమజీవుల దోపిడీకి వ్యతిరేకంగా వందేళ్లుగా సీపీఐ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, రమేష్, కళావతమ్మ, శ్రీహరి, రాబర్ట్, మోష, సీఎస్ శెట్టి, శివ, చంద్రయ్య, కృష్ణవేణి, గీత, భాస్కర్, మహేష్, బాలరాజు పాల్గొన్నారు.